సాక్షి పల్నాడు

మంగళవారం । 21 । నవంబర్ । 2023



ఈమనిలో ఇరుముడులు

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండలం ఈమనిలో సోమవారం అయ్యప్ప మాలధారులు భక్తిశ్రద్ధలతో ఇరుముడులు కట్టించుకున్నారు.



వెండి త్రిశూలం బహూకరణ

నకరికల్లు: నర్సింగపాడులోని మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామికి టి.శ్రీనివాసరావు, రమాదేవి దంపతులు సోమవారం రూ.2.25 లక్షల వెండి త్రిశూలాన్ని బహూకరించారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వార్షికోత్సవం



ఫిరంగిపురం: పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ దశమ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు శాంతికల్యాణం నిర్వహించారు.

న్యూస్‌రీల్

నవోదయకు 1,532 దరఖాస్తులు

యడ్లపాడు: జాతీయ స్థాయిలో జవహర్ నవోదయ విద్యాలయా(జేఎన్‌వీ)ల్లో 2024–25 విద్యా సంవత్సరంలో 9,11 తరగతుల ప్రవేశ పరీక్షలకు సంబంధించి 1,532 దరఖాస్తులు వచ్చినట్లు చిలకలూరిపేట మండలం మద్దిరాల జేఎన్‌వీ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆయా తరగతుల మిగుల సీట్ల భర్తీ కోసం నిర్వహించే ఈ ప్రవేశ పరీక్షకు ఈనెల 15తో దరఖాస్తు గడువు ముగిసిందన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 9వ తరగతికి 950 మంది, అలాగే 11వ తరగతికి 582 మంది దరఖాస్తు చేశారని పేర్కొన్నారు.

పరీక్ష కేంద్రాలు ఇవే..

2024 ఫిబ్రవరి 10న నిర్వహించే పరీక్ష కేంద్రాలను నరసింహారావు వెల్లడించారు. చిలకలూరిపేట పట్టణంలోని సాధినేని చౌదరయ్య పబ్లిక్ స్కూల్, శారద జెడ్పీ హైస్కూల్, ఆర్‌వీఎస్‌సీవీఎస్ హైస్కూల్, ఏఎంజీ హైస్కూల్, నవోదయ విద్యాలయాలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. త్వరలోనే విద్యార్థులకు అడ్మిట్ కార్డులను ఆన్‌లైన్‌లో ఉంచుతామని, వాటిని డౌన్‌లోడ్ చేసుకోవాల్సిందిగా కోరారు.

యార్డుకు 29,271 బస్తాల మిర్చి రాక




కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 26,681 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 29,271 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి 24,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.8,500 నుంచి రూ.23,200 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,000 నుంచి 25,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.12,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 11,362 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 524.50 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 27,440, ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 840.70 అడుగుల వద్ద ఉంది.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 2212 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 147, బ్యాంక్ కెనాల్‌కు 243, తూర్పు కెనాల్‌కు 107 , పశ్చిమ కెనాల్‌కు 47 , నిజాంపట్నం కాలువకు 243, కొమ్మమూరు కాల్వకు 733 క్యూసెక్కులు విడుదల చేశారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2,000, గరిష్ట ధర రూ.2,800, మోడల్ ధర రూ.2,400 వరకు పలికింది.

సామాజిక సంభ్రమం

పల్నాడు నడిబొడ్డు నరసరావుపేట నడుంబిగించి కదం తొక్కింది. సామాజిక సమరభేరి మోగించింది. అడుగులే పిడుగులై గర్జించింది. పాదయాత్రలో ప్రభంజనమై గళమెత్తింది. సాహో సంక్షేమ సారథీ అంటూ జయధ్వానం పలికింది. పరవళ్లు తొక్కిన అశేష జనవాహినిని చూసి పౌరుషాలగడ్డ సంభ్రమాశ్చర్యాలతో పరవశమై మురిసింది.

నడుంబిగించిన నరసరావుపేట

- వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార యాత్ర జయప్రదం
- పాదయాత్రలో కదంతొక్కిన ప్రజలు
- పార్టీ శ్రేణుల్లో అంబరాన్నంటిన ఉత్సాహం



పాదయాత్రలో నాయకుల వెంట నడుస్తున్న అశేష జనవాహిని (అంతరచిత్రాలు) బస్సుయాత్రలో పాల్గొన్న మంత్రులు ఆదిమూలపు, కారుమూరి, ఎమ్మెల్సీ జంగా, డొక్కా సభలో మాట్లాడుతున్న మంత్రి మేరుగ

సాక్షి, నరసరావుపేట, నరసరావుపేట/నరసరావుపేట రూరల్: సామాజిక విప్లవ సారథి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రజలు అడుగడుగునా జేజేలు పలుకుతున్నారు. ఆయన ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం నరసరావుపేటలో జరిగిన వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార యాత్రకు ప్రజలు అశేషంగా తరలివచ్చారు. అడుగడుగునా నాయకులకు బ్రహ్మరథం పట్టారు. సమరోత్సాహంతో కదంతొక్కారు. పాదయాత్ర, భారీ బహిరంగ సభను జయప్రదం చేశారు. తమకు ఈ ప్రభుత్వంలో నాలుగున్నరేళ్ల కాలంలో అందిన లబ్ధిని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు ఎలుగెత్తి చాటాయి. ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో జరిగిన యాత్ర ఆద్యంతం వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపింది. సామాజిక సాధికార యాత్రకు పట్టణంతోపాటు నరసరావుపేట, రొంపిచర్ల మండలాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. కేసానుపల్లి సమీపంలోని ఎల్‌టీ నగర్ నుంచి పాదయాత్రను నాయకులు ప్రారంభించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యులు వి.విజయసాయిరెడ్డి, పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, మంత్రులు మేరుగ నాగార్జున, ఆదిమూలపు సురేష్ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, ఎమ్మెల్సీలు కుంభా రవి, జంగా కృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్యవరప్రసాద్ తొలుత లలితాదేవి కాలనీలోని గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాదయాత్రను ప్రారంభించారు. కార్యక్రమానికి విచ్చేసిన అతిథులకు ఎల్‌టీ నగర్, మల్లమ్మసెంటర్, శివుని బొమ్మ సెంటర్ వద్ద భారీ క్రేన్ల సాయంతో గజమాలలను వేసి పార్టీ కార్యకర్తలు సత్కరించారు. కాకుమాను బజార్ వద్ద ఆర్యవైశ్య నాయకులు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి సందడి చేశారు. ఎస్ఆర్‌కేటీ కాలనీ, పనసతోట ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. పాదయాత్ర మార్గంలో శివుని బొమ్మ వద్ద పూజలు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. పనసతోటలో ముస్లిం మత పెద్దలు ప్రార్థనలు జరిపి ఆశీర్వదించారు. యువకులు ద్విచక్రవాహనాలతో ర్యాలీలో పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధాన సెంటర్లలో మహిళలు రోడ్లమీదకు వచ్చి సంఘీభావం ప్రకటించారు. ఎల్‌టీ నగర్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర ఎస్ఆర్‌కేటీ కాలనీ, చిలకలూరిపేట ఫ్లైవర్, మల్లమ్మసెంటర్, శివుని బొమ్మ సెంటర్, గడియారస్తంభం సెంటర్ మీదుగా పల్నాడు రోడ్డులోని బహిరంగ సభా ప్రాంగణం వరకు సాగింది. సభలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీ ఎమ్మెల్యే జియావుద్దీన్, ముదిరాజు, కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్మన్ కోలా భవాని, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ దేవెళ్ల రేవతి, గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్లు ఇ.యం. స్వామి, పాలపర్తి వెంకటేశ్వరరావు మాట్లాడారు. రొంపిచర్ల ఎంపీపీ గద్దం వెంకటరావు, వడ్డెర సంక్షేమ సంఘ జిల్లా సభ్యుడు వేముల శివ, జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, పార్టీ నరసరావుపేట మండల కన్వీనర్ తన్నీరు శ్రీనివాసరావు, రొంపిచర్ల మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుండాల వెంకటేష్, బీసీ నేత పల్లపు అంజయ్య, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు అచ్చిశివకోటి పాల్గొన్నారు.

సామాజిక న్యాయం జగన్‌తోనే సాధ్యం



ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సామాజిక న్యాయం పాటిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని పేర్కొన్నారు. నియోజకవర్గంలో సంక్షేమ పథకాల ద్వారా రూ.560 కోట్లను నగదు బదిలీ ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశామని వెల్లడించారు. మరో రూ.270 కోట్లను నగదు బదిలీయేతర పద్ధతి ద్వారా అందజేశామన్నారు. నియోజకవర్గంలో మొత్తం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన 80 వేల కుటుంబాలకు పథకాలు అందాయని సగర్వంగా ప్రకటించారు. నరసరావుపేటను జిల్లా కేంద్రంగా చేయాలన్న 65 ఏళ్ల కలను సీఎం జగన్ సాకారం చేసి అభివృద్ధికి పునాది వేశారన్నారు. శివారు ప్రాంతాలను మున్సిపాలిటీలో కలిపి రూ.43 కోట్లతో రోడ్లు, డ్రెయిన్లు నిర్మించి మంచినీరు అందజేసి సుమారు 10 వేల మందికి మంచి చేశామన్నారు. ఆటోనగర్, షాదీఖానా, బీసీ భవన్ నిర్మాణాలను త్వరలో ప్రారంభిస్తామన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లుగా ప్రజలకు అందజేస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో జనసేన, బీజేపీ, టీడీపీ కలిసి వచ్చినా సింహం సింగిల్‌గానే వస్తుందని, సీఎం జగన్ మళ్లీ సీఎం కావటం ఖాయమని, తాను హ్యాట్రిక్ సాధిస్తానని పేర్కొన్నారు. మీకు న్యాయం జరిగితేనే ఓటేయమన్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని చెప్పారు.

గిరిజనులకు 3.26 లక్షల ఎకరాలు అందించాం



ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను నా వాళ్లు అంటూ ఆప్యాయంగా పిలిచి ప్రోత్సహిస్తున్న వ్యక్తి వైఎస్ జగన్ అని ఎమ్మెల్సీ కుంభా రవిబాబు వ్యాఖ్యానించారు. చంద్రబాబు సీఎంగా ఉండగా ఎస్టీలకు మంత్రి పదవి ఇవ్వలేదన్నారు. సీఎం జగన్ డెప్యూటీ సీఎం పదవి ఇవ్వడంతోపాటు, ట్రైబల్ కమిషన్ ఏర్పాటుతోపాటు, ఎస్టీలకు ఎమ్మెల్సీ పదవీ ఇచ్చారన్నారు. అటవీ హక్కుల చట్టం ద్వారా రాష్ట్రంలో ఏకంగా 3.26 లక్షల ఎకరాల భూమిని ప్రభుత్వం గిరిజనులకు అందజేసిందన్నారు. ఈ ప్రభుత్వాన్ని గెలిపించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు.

జగనన్న పాలనలోనే సాధికారత

మీడియా సమావేశంలో మంత్రులు ఆదిమూలపు సురేష్, కారుమూరి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, చిత్రంలో ఎమ్మెల్సీ కుంభారవి, మంత్రి కారుమూరి, ఎమ్మెల్యే గోపిరెడ్డి, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, మాణిక్యవరప్రసాద్

సాక్షి, నరసరావుపేట: సామాజిక సాధికారతను ఆచరణలో చూపిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ చెప్పారు. వైఎస్సార్ సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్రలో భాగంగా సోమవారం నరసరావుపేట ఏ–1 ఫంక్షన్ హాల్‌లో జరిగిన మీడియా సమావేశంలో మంత్రులు మేరుగ నాగార్జున, కారుమూరి నాగేశ్వరరావు, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్సీ కుంభా రవిబాబుతో కలసి ఆదిమూలపు మాట్లాడారు. సామాజిక సాధికార యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. మళ్లీ వైఎస్సార్ సీపీకే పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. 2019లో రాష్ట్ర ప్రజలు తీసుకున్న మంచి నిర్ణయం వల్ల ఇప్పుడు ఫలితాలు అనుభవిస్తున్నామని, బలహీన వర్గాలు మరింత అభివృద్ధి చెందాలంటే జగనన్న మళ్లీ సీఎం కావాలన్నారు.

మాటపై నిలబడే వ్యక్తి జగన్ : కారుమూరి

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పేర్కొన్నారు. జగనన్న పాలనలో బీసీలకు అధిక పదవులు దక్కాయన్నారు. 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం చారిత్రాత్మకమన్నారు. కేబినెట్ పదవుల్లో 70 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చిన ఘనత ఒక్క జగన్‌దేనన్నారు. జగనన్న పాలనలో నలుగురు బీసీలకు రాజ్యసభ పదవులు దక్కాయన్నారు. గతంలో 11 శాతానికి పైగా ఉన్న పేదరికం జగన్ పాలనలో ఏకంగా ఆరు శాతానికి తగ్గిపోయిందన్నారు. జీడీపీలో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నామంటే ఇది కాదా అభివృద్ధి అని ప్రశ్నించారు. మీడియా సమావేశంలో రాజ్యసభ సభ్యులు వి.విజయసాయిరెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమానికి శక్తి వంచన లేకుండా కృషి

నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అంటూ ప్రజల సంక్షేమానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్న మహోన్నత వ్యక్తి వైఎస్ జగన్ అని ఎమ్మెల్సీ కుంభా రవిబాబు వ్యాఖ్యానించారు. 76 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో బలహీనవర్గాలు ద్వితీయ శ్రేణి పౌరులుగా ఉన్నారని, ఎంతో అణిచివేతకు గురయ్యారని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో వారు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎంతో వృద్ధి చెందారని వివరించారు. ఉన్నత వర్గాల పిల్లలు మాత్రమే ఇంగ్లిష్ మీడియంలో చదవాలన్న ప్రతిపక్షాల కుట్రలను ఛేదించి ప్రతి పేదింటి బిడ్డకూ నాణ్యమైన చదువులు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు.

బీసీలకు అండగా నిలిచిన జగన్

గత ప్రభుత్వాలు బలహీన వర్గాలను కేవలం ఓటు బ్యాంక్‌గానే వినియోగించుకున్నాయని, వారికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ చెప్పారు. జగన్ ప్రభుత్వంలో బీసీల అభ్యున్నతికి విశేష కృషి జరిగిందని వివరించారు. వైఎస్సార్ తన హయాంలో మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి వాటితో రెండు అడుగులు ముందుకు వేస్తే జగనన్న నాలుగు అడుగులు ముందుకు వేసి మైనార్టీలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారన్నారు. మైనార్టీలకు ఇంత కన్నా ఎక్కువ మేలు చేసిన ప్రభుత్వం మరొకటి లేదన్నారు. అందుకే మైనార్టీలు రాష్ట్ర వ్యాప్తంగా జగనన్నకు అండగా నిలుస్తున్నామన్నారు.

సాధికారతకు నిజమైన నిర్వచనం జగన్ పాలన

సమానత్వం, సాధికారత అనే పదాలకు నిజమైన నిర్వచనం వైఎస్సార్ సీపీ పాలన అని ఆ పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాదరావు అన్నారు. విద్య, వైద్య ప్రమాణాలు పెంచి వాటిని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అందుబాటులోకి తెచ్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ఈ ప్రభుత్వంలో జరిగిన మంచిని ప్రజలకు వివరించేందుకు వచ్చామని పేర్కొన్నారు. అందరం కష్టించి మళ్లీ వైఎస్ జగన్‌ను సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

26న సామాజిక సాధికార బస్సు యాత్ర

గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



గురజాల : ఈనెల 26న గురజాలలో సామాజిక సాధికార బస్సు యాత్ర జరుగుతుందని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక పంచాయతీ రాజ్ బంగ్లాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాసు మాట్లాడారు. బస్సు యాత్రలో మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటారని, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా యాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు సామాజికంగా అన్ని పదవులు కేటాయించి వారికి సరైన గౌరవం ఇచ్చిన పార్టీ వైఎస్సార్ సీపీ మాత్రమేనని స్పష్టం చేశారు. గురజాల నియోజకవర్గంలో మైనార్టీలకు 6 పదవులు లభించాయని, ఎమ్మెల్సీలుగా ఇద్దరు బీసీలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పించారని పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్ రెడ్డి, ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మబుజ్జి, వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, నగర పంచాయతీ చైర్‌పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి, వైస్ చైర్మన్లు షేక్ బడేజానీ, మన్నెం కన్యాకుమారి ప్రసాద్, పార్టీ పట్టణ కన్వీనర్ కె.అన్నారావు, మార్కెట్ యార్డు చైర్మన్ కలకండ ఆంద్రెయ్య, కో–ఆప్షన్ మెంబర్ షేక్ పీర్ అహ్మద్, గడిపూడి పెద చెన్నయ్య, పాశం హనిమిరెడ్డి పాల్గొన్నారు.

కొల్లిపర వంతెన నిర్మాణానికి ప్రభుత్వం పచ్చజెండా

కొల్లిపర(తెనాలి): కొల్లిపరలో కొలువుల రోజున ప్రభుత్వం తీపి కబురు అందించింది. లంక గ్రామాల నుంచి, విజయవాడ–రేపల్లె వైపు నుంచి కరకట్ట మీదుగా కొల్లిపరకు రాకపోకలకు అతిప్రధానమైన పురాతన వంతెన స్థానంలో హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి జీఓ జారీచేసింది. రాష్ట్రంలో పెద్ద ఎత్తున రోడ్లు, వాటిని అనుసంధానం చేసే వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవపల్‌మెంట్ (ప్రోగ్రెస్.1) ద్వారా 788 జీఓను జారీచేసింది. ఇందులో కొల్లిపరలోని వంతెన నిర్మాణానికి రూ.4.19 కోట్లను కేటాయిస్తూ అనుమతులు మంజూరు చేయటం విశేషం. రేపల్లె

రూ.4.19 కోట్లతో జీఓ జారీ

బ్యాంక్ కెనాల్‌పై 32.75వ కిలోమీటరు వద్ద దీనిని నిర్మిస్తారు. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ చిన్నవంతెన శిథిలావస్థకు చేరుకున్న విషయం తెలిసిందే. విజయవాడ–రేపల్లె కరకట్ట మార్గంలో రాకపోకలు చేయాలన్నా, కృష్ణాతీరంలో సాగుచేసిన పంటల రవాణాకు ఈ వంతెన ఎంతో కీలకం. దీని ఆవశ్యకతను గుర్తించిన గ్రామానికి చెందిన ప్రముఖుడు బొంతు గురవారెడ్డి కొంతకాలం క్రితం ముఖ్యమంత్రి కార్యదర్శి సాల్మోన ఆరోక్యరాజ్‌కు వివరించి, కొత్త వంతెన నిర్మాణానికి అనుమతుల మంజూరు కోసం కృషిచేశారు. ఎంతోమంది సహకారం కూడా తీసుకున్నారు. అన్ని అవరోధాలు దాటుకుని రూ.4.19 కోట్లతో అనుమతులు మంజూరుచేస్తూ జీవో రావటంపై బొంతు గురవారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మన ఊరు మన బాధ్యతగా కొల్లిపర వంతెన నిర్మాణానికి తన వంతు సహకారం అందించానని చెప్పారు. త్వరలోనే టెండర్లు పిలిచి, పనులు ప్రారంభిస్తారని వివరించారు. కొన్ని దశాబ్దాలుగా కొల్లిపర వంతెనను నిర్మాణాన్ని సాకారమయ్యేలా కృషిచేసిన గురవారెడ్డికి రైల్వే సంప్రదింపుల కమిటీ సభ్యుడు ప్రశాంత్‌రెడ్డి గ్రామప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం కావాలి

అధికారులకు కలెక్టర్ శివశంకర్ ఆదేశం



ప్రజా సమస్యలు వింటున్న కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం కావాలని అధికారులను కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో సోమవారం జగనన్నకు చెబుదాం– స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి 160 అర్జీలు, వినతిపత్రాలను స్వీకరించారు. సచివాలయ సిబ్బందిని పిలిచి ఓటర్ల జాబితా తయారీ అంశంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్జీదారులు ఇచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల ఉద్యోగులు వెంటనే పరిష్కరించాలని సూచించారు. వలంటీర్లు అర్జీల తయారీలో ప్రజలకు సహకారం అందించారు. అనంతరం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలకు భోజన ఏర్పాట్లు చేసిన పల్నాడు జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వాహకులను కలెక్టర్ సత్కరించారు. డీఆర్వో కె.వినాయకం, పులిచింతల ప్రాజెక్టు ప్రత్యేక అధికారి వసంతబాబు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది హాజరయ్యారు.

కార్తికం.. ప్రకా‘శివ’ంతం



కార్తిక మాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ దీపారాధనలతో ప్రకాశించింది. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి త్రికోటేశ్వరుని దర్శించుకుని పులకించారు. స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు నిర్వహించిన అనంతరం భక్తులను స్వామి దర్శనానికి అనుమతించారు . రద్దీ దృష్ట్యా స్వామి మూలవిరాట్ అభిషేకాలను నిలిపివేశారు. అభిషేక మండపంలో జరిగిన విశేష అభిషేక పూజల్లో భక్తులు పాల్గొన్నారు. ఆలయం వెనుక ఉన్న రావిచెట్టు వద్ద మహిళలు కార్తిక దీపాలు వెలిగించారు.



నాగేంద్రుని పుట్ట, మహానందీశ్వరుడి వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. నరసరావుపేట, చిలకలూరిపేటల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపింది. ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు. - నరసరావుపేట రూరల్

క్లుప్తంగా

రైలుకింద పడి ప్రేమికుల ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన పావని, రాకేష్ (ఫైల్)

గూడూరు రూరల్ (తిరుపతి జిల్లా): విజయవాడలోని కోచింగ్ సెంటర్లో కుదిరిన స్నేహం విడదీయరాని బంధంగా ఏర్పడింది. పెద్దలు ఎక్కడ తమను కలుసుకోకుండా చేస్తారో అన్న భయంతో ఆ జంట గూడూరుకు సమీపంలో ఆదివారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన సంచలనం కలిగించింది. వివరాల్లోకి వెళితే.. గుంటూరు జిల్లా శ్రీరుక్మిణీపురానికి చెందిన అన్నంగి పావని (19) హోటల్ మేనేజ్‌మెంట్ చేసింది. చిల్లకూరు మండలంలోని ఓ హోటల్‌లో పని చేసేందుకు సొంత ఊరి నుంచి తల్లిదండ్రుల అనుమతి తీసుకుని రెండు రోజుల క్రితం వచ్చింది. ఇక్కడ నుంచి తనకు గతంలో విజయవాడలోని కోచింగ్ సెంటర్‌లో చదుకుని ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న పశ్చిమ గోదావరి జిల్లా, సగిపాడు గ్రామానికి చెందిన దండే రాకేష్(23)ను గూడూరుకు రావాలని ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చింది. దీంతో ఆదివారం గూడూరు వచ్చి ఇద్దరు కలుసుకుని చాలా సేపు భావి జీవితానికి సంబంధించిన విషయాలను మాట్లాడుతుకున్నారు. అనంతరం ఇద్దరి మధ్య ఉన్న ప్రేమ పెద్దలకు ఇష్టం లేకపోతే ఇద్దరు ఎవరికి వారు దూరం కావాల్సి వస్తుందని భావించిన వారు ఒకరిని విడిచి ఒకరు ఉండలేక గూడూరు రైల్వే స్టేషన్ నుంచి సుమారు మూడు కి.మీ దూరంలో ఉన్న గాంధీనగర్ ప్రాంతం వరకు ట్రాక్‌పై నడిచి వెళ్లి అక్కడ రైలు పట్టాలపై పడుకున్నారు. వారిపై నుంచి గూడ్స్ ట్రైన్ వెళ్లడంతో తలలు తెగి వారు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. చిన్న వయస్సులో ప్రేమించుకున్న ప్రేమికులు పుట్టిన ఊరు నుంచి దూరంగా వచ్చి ఆత్మహత్య చేసుకోవడం గూడూరు డివిజన్‌లో సంచలనం సృషించింది. యువతీ యువకుల మృతదేహాలను గుర్తించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచార ఇచ్చారు. వారు సోమవారం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుల తల్లిదండ్రులు ఆసుపత్రి వద్ద రోదించడం చూసిన వారు కన్నీటి పర్యంతం అయ్యారు.

పత్తి అమ్మకాలకు దళారులను ఆశ్రయించవద్దు



సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- సత్తెనపల్లి సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

సత్తెనపల్లి: దళారులను ఆశ్రయించకుండా పత్తి పంట సాగు చేసిన రైతులే నేరుగా సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రంలో విక్రయించుకోవాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ఏఎంసీ చైర్మన్ పెండెం బాబూరావు అధ్యక్షత వహించారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని రైతు భరోసా కేంద్రంలోనూ, ఈ- క్రాప్ బుకింగ్‌లోనూ పేరు నమోదు చేసుకున్న రైతులే నేరుగా వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రంలో తమ పంటను విక్రయించుకోవచ్చునన్నారు. పంట నాణ్యతను బట్టి ధర లభిస్తుందని చెప్పారు. కనీస మద్దతు ధరగా క్వింటాకు రూ.7,020గా ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు. తొలుత సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి పత్తిని పరిశీలించారు. సాంకేతిక సమస్యలను అధిగమించి రైతుల పత్తిని కొనుగోలు చేయాలని బయ్యర్ రవిప్రసాద్‌కు సూచించారు. దళారుల ప్రమేయం ఏమాత్రం లేకుండా పర్యవేక్షణ చేయాలని మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎస్ఎం ఇస్మాయిల్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కళ్లం శివరామిరెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, రాష్ట్ర రైతు సలహా మండలి సభ్యుడు కళ్లం విజయభాస్కర్ రెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వైద్యార్య, దేవరశెట్టి రవికుమార్, విజయలక్ష్మి, ఆళ్ల జగ్గయ్య, నాయకులు ఎంజీఎం రామలింగా రెడ్డి(చిన్నా), తాళ్లూరి మోహన్‌బాబు ఉన్నారు.

అమరేశ్వరాలయంలో కార్తిక సందడి



అలంకార శోభితుడైన అమరేశ్వర స్వామి



స్వామివారిని దర్శించేందుకు క్యూలైన్లలో ఉన్న భక్తులు

పోటెత్తిన భక్తులు

అమరావతి: ప్రసిద్ధ శైవ క్షేత్రం అమరావతి బాల చాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయం కార్తిక సోమవారం కిటకిటలాడింది. వేకువజా మునుండే రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల నుంచి వచ్చిన పంచారామక్షేత్ర సందర్శన భక్తులు పూజలు చేశారు. పవిత్ర కృష్ణాజలాలలో కార్తిక స్నానాలు చేసి, ఆలయంలోని ఉసిరిక చెట్టు వద్ద కార్తిక దీపారాధనలు చేసి కార్తిక దామోదరునికి విశేషపూజలు నిర్వహించారు. అమరేశ్వరునికి అభిషేకాలు, బాల చాముండేశ్వరీ అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు శివపంచాక్షరీ నామంతో అమరేశ్వరాలయం ప్రతిధ్వనించింది. ఉదయం సుమారు 70 పైగా బస్సులలో పంచారామ క్షేత్రసందర్శన యాత్రికులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ కార్తిక సోమవారం విశిష్టతను వివరించారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ఈఓ వేమూరి గోపినాథశర్మ పర్యవేక్షించారు. సుమారు 12 వేల మంది భక్తులు దర్శించుకున్నారని దేవాలయ అధికారుల అంచనా.

వైఎస్ జగన్ ప్రభుత్వంలో అత్యంత మెరుగైన వైద్యం

- ఎంపీ విజయసాయి రెడ్డి
- సామాజిక సాధికార యాత్ర సందర్భంగా వైద్యుల ఆత్మీయ సమావేశం

సాక్షి, నరసరావుపేట: ఆరోగ్యశ్రీ పథకంతో పేదోడికి ఖరీదైన వైద్యం అందుబాటులోకి తెచ్చి దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న మహానేత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని, ఆయన స్ఫూర్తితో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక సంస్కరణ చేపట్టి, ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ దక్షిణ కోస్తా జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ విజయసాయి రెడ్డి అన్నారు. సామాజిక సాధికార యాత్రలో భాగంగా పల్నాడు జిల్లా నరసరావుపేటలో వైద్యులతో ఆత్మీయ సమావేశం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సమాజంలో అత్యంత గౌరవ ప్రదమైన వృత్తి వైద్యంగా ప్రజలందరూ భావిస్తారని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వైద్యులకు అధిక ప్రాధాన్యం కల్పించినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇలా 15 మంది వైద్యులు ఎమ్మెల్యేలుగా ఉన్నారని గుర్తు చేశారు. అంతేకాక అత్యంత ప్రాధాన్యం కలిగిన పలు ప్రభుత్వ ఉన్నత పోస్టుల్లో వైద్యులను నియమించారని వివరించారు. గతంలో పేద వారికి ఖరీదైన వైద్యం అందని ద్రాక్షలా ఉండేదని, వైద్యానికి డబ్బుల్లేక, మరణించిన సందర్భాలు ఉండేవని అన్నారు. వైద్యానికి డబ్బులు లేక పేదోడు మరణించకూడాదనే లక్ష్యంతో దివంగత వైఎస్సార్ మనస్సు నుంచి ఉద్భవించిన పథకమే ఆరోగ్యశ్రీ అని వివరించారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింతగా విస్తరించి, ఆరోగ్యశ్రీ పరిధిలోని జబ్బులు, నెట్ వర్క్ ఆస్పత్రుల సంఖ్యను సీఎం వైఎస్ జగన్ మరింతగా పెంచారని అన్నారు. ఆస్పత్రులు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ అఫిలియేషన్ పొందడంలో ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని, తాను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ముఖ్యమంత్రి వైద్యరంగంలో తెచ్చిన విప్లవాత్మక సంస్కరణలు, ప్రజలకు అందిస్తున్న మెరుగైన వైద్య సేవలు ప్రజలకు తెలియజేయాలని కోరారు. అలాగే పట్టణంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో సమావేశం నిర్వహించారు.

పెళ్లి చేసుకుంటానని రూ.25 లక్షలు దోచేశాడు..

నాదెండ్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళకు భర్తతో మనస్పర్థలు వచ్చాయి. విడాకుల కోసం కోర్టును ఆశ్రయించింది. ఈ సమయంలో మ్యారేజ్ వేదిక ద్వారా ఓ వ్యక్తి పరిచయం అయ్యాడు. భార్యతో విడాకులు తీసుకున్నానని , మరో పెళ్లి చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నాననే పోస్టు పెట్టాడు. ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. త్వరగా నీ భర్త నుంచి నాకు విడాకులు ఇప్పిస్తానని రూ.4 లక్షలు తీసుకున్నాడు. ఆ తర్వాత వివాహం చేసుకుంటే ఆర్థికంగా ఇబ్బందులు లేకుండా ఉండేందుకు వ్యాపారం చేయాలంటూ నన్ను ష్యూరిటీగా చూపించి రూ.20 లక్షలు కాజేశాడు. ఆ తర్వాత నుంచి కనిపించకుండా తిరుగుతుంటే అతడి గురించి విచారించగా అతడికి వివాహం అయ్యి, పిల్లలు ఉన్నట్లు తెలిసింది. దీంతో ఆ మహిళ మోసపోయినట్లు గుర్తించి నాకు న్యాయం చేయాలని స్పందనలో అర్జీ ఇచ్చింది.



జిల్లా పోలీసు కార్యాలయంలో బాధితుని వివరాలు తెలుసుకుంటున్న దిశ డీఎస్పీ రవిచంద్ర

- జగనన్నకు చెబుదాంలో ఓ మహిళ ఫిర్యాదు
- స్పందనకు 44 ఫిర్యాదులు

నరసరావుపేట: జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాంలో ప్రజల నుంచి దిశ డీఎస్పీ యు.రవిచంద్ర 44 ఫిర్యాదులు స్వీకరించారు. స్వీకరించిన వాటిలో కుటుంబ, ఆర్థిక, ఆస్తి వివాదాలు, ఆయా సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు ఉన్నాయి. ఈ సందర్భంగా దాతల సహకారంతో భోజనాలు ఏర్పాటు చేశారు.

రూ.1.38 లక్షలు డ్రా చేసుకున్నాడు..

నాకు ప్రమాదం జరగడంతో నరసరావుపేటలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చేరాను. చికిత్స నిమిత్తం నకరికల్లుకు చెందిన వ్యక్తి, ఆటో డ్రైవర్, కొండమోడుకు చెందిన మరో వ్యక్తి ముగ్గురికి డబ్బులు డ్రా చేసుకొని తీసుకురావాలని ఏటీఎం కార్డు ఇచ్చాను. దాని నుంచి వారు రూ.1.38 లక్షలు డ్రా చేసుకుని కార్డు, డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. తనకు డబ్బు, కార్డు ఇప్పించి న్యాయం చేయండి.

–శ్రీనివాసులు, చల్లగుండ్ల, నకరికల్లు మండలం

అసభ్యకరమైన ఫొటోలతో భర్త ఇబ్బంది పెడుతున్నాడు

నా భర్తతో మనస్పర్థలు రావడంతో రెండేళ్ల నుంచి విడిగా ఉంటున్నాం. నెల రోజుల నుంచి సోషల్ మీడియాలో నా గురించి అసభ్యకరంగా మెసేజ్‌లు, ఫొటోలు పెడుతూ ఇబ్బంది పెడుతున్నాడు. అతడి చర్యలను నివారించి న్యాయం చేయండి.

–ఓ మహిళ, గురజాల

పీఎం విశ్వకర్మ యోజనలో 18 రకాల వృత్తులకు అవకాశం

లక్ష్మీపురం: కులవృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారిని ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా 18 రకాల కుల వృత్తుల వారికి కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనను తీసుకువచ్చింది. సాంకేతికతను వినియోగించే విధంగా శిక్షణ ఇచ్చి, ఆ సమయంలో రోజువారీగా కొంత భృతి రూపంలో డబ్బులు ఇవ్వనున్నారు. వివరాలకు www. pmvishwakarma. gov. in వెబ్‌సైట్‌లో సంప్రదించాలి.

బాల కార్మిక వ్యవస్థ రహిత జిల్లాగా మార్చండి

జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: పల్నాడు జిల్లాను బాల కార్మిక వ్యవస్థ రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి కోరారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో కార్మిక శాఖ ఆధ్వర్యంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం సమావేశం సోమవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బాల కార్మికులు, కిశోర బాలల సంరక్షణ, పునరావాసానికై ఈనెల 23 నుంచి డిసెంబర్–20వ తేదీ వరకు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌ను విజయవంతం చేయాలని ఆదేశించారు. బాల కార్మికులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించాలని చెప్పారు. వారి వివరాలు సేకరించి అవసరమైన చదువు, ఆర్థిక, కిశోర బాలలకు అవరమైన పునరావాసం వంటివి ఆయా శాఖలు చేపట్టాలని సూచించారు. ఎంత చేసినప్పటికీ వారి అలవాట్లు మాన్పడం కష్టమని, దానికి కొంత సమయం పడుతుందని వివరించారు. వచ్చే శుక్రవారం నిర్వహించే మండలలో ప్రత్యేక అధికారుల పర్యటనలో బాల కార్మికులను గుర్తించి వారికి అవరసమైన చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో, అభివృద్ధి, సంక్షేమ పథకాలను డీబీటీ పద్ధతిలో చేపట్టినప్పటికీ ఇంకా బాల కార్మికులు, వీధి బాలలు ఉండడం శోచనీయమన్నారు. ఇటీవల మాచర్లలో నిర్వహించిన ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంలో కృషి చేసిన అధికారులను అభినందించారు. అనంతరం బాల భద్రత మనందరి బాధ్యత, పిల్లల బాల్యాన్ని కాపాడుదాం గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, జిల్లా ఇన్‌చార్జి ఆఫీసర్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్, బెంచ్‌ప్రెస్ రాష్ట్రజట్టు ఎంపిక



ఎంపికైన రాష్ట్ర జట్టుతో పల్నాడు జిల్లా సెక్రటరీ సురేష్

సత్తెనపల్లి: క్రీడాకారులు జాతీయ స్థాయిలో పతకాలను సాధించి పల్నాడు జిల్లాకు మంచి పేరు, ప్రఖ్యాతలు తీసుకురావాలని పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ అసోసియేషన్ పల్నాడు జిల్లా సెక్రటరీ పసుపులేటి సురేష్ అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని పవర్ హౌస్ ఫిట్నెస్ కార్యాలయంలో జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు పల్నాడు జిల్లా నుంచి సోమవారం ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. ఎంపికైన క్రీడాకారులకు బెంగళూరులో ఈ నెల 22 నుంచి 26 జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ - బెంచ్ ప్రెస్ పోటీలు జరగనున్నాయన్నారు. అనంతరం ఎంపికలు నిర్వహించారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ అండ్ ఉమెన్ ఏక్విప్పెడ్ అండ్ అన్ ఏక్విప్పెడ్ పోటీలు నిర్వహించనున్నారన్నారు. సబ్ జూనియర్ విభాగం నుంచి 53 కేజీల్లో కత్తి కార్తీక్(గురజాల), 66 కేజీల్లో షేక్ కరీం బాషా(సత్తెనపల్లి), జూనియర్ విభాగంలో 52 కేజీల్లో ఎం.అనూష(కారంపూడి), 66 కేజీల్లో షేక్ మొహిద్దీన్ (సత్తెనపల్లి), సీనియర్ విభాగం నుంచి 83 కేజీల్లో షేక్ నజీర్ (సత్తెనపల్లి),
93 కేజీల్లో నర్రా అరుణ్ కుమార్ (సత్తెనపల్లి), 105 కేజీల్లో కత్తి జ్యోతి బాబు (గురజాల)లు ఎంపికయ్యారు. పల్నాడు జిల్లా ప్రెసిడెంట్ జిమ్ము రాజు, జి.ఆనంద్, జి.రమేష్, ఎస్.మణిరత్నం, టి.శంకర్, షేక్ జానీ, సయ్యద్ మస్తాన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాతంగి సాంబశివరావు, శాంతయ్య ఉన్నారు.

సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ ప్రాధాన్యం

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



లబ్ధిదారుకు ఇళ్ల పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల రూరల్: ఏ ప్రభుత్వం చేయలేని పనిని జగనన్న ప్రభుత్వం చేసి చూపుతోందని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీవాసులకు సోమవార ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రాహ్మణపల్లిలో ఎస్సీ కాలనీ ఏర్పడి 40 ఏళ్లు అవుతుందని ఇంత వరకు పట్టాలు ఇవ్వలేదని చెప్పారు. నాలుగు నెలల్లో పట్టాలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈ పట్టా మీ హక్కుకు సూచిక అని, దీని ద్వారా మీ ఆస్తి విలువ పెరుగుతుందని అన్నారు. మెడికల్ కాలేజీ పూర్తి అయితే ఇంకా మీ ఇళ్ల స్థలాలకు మంచి రేటు వస్తుందని వివరించారు. అనంతరం 250 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ చక్రవర్తి, ఎంపీడీఓ కాశయ్య, పార్టీ మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, ఎంపీపీ అల్లు పిచ్చిరెడ్డి సత్యవతి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వీరభద్రుని రామిరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ముడేల వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచి పి.వీర రాఘవయ్య, మాజీ సర్పంచి షేక్ ఖాశింబి బడేషా, ఎంపీటీసీలు నాగిరెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా ఖోఖో జట్ల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయులు

నరసరావుపేట ఈస్ట్: ఉమ్మడి గుంటూరు జిల్లా పురుషులు, మహిళల ఖోఖో జట్ల వివరాలను సోమవారం కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు, వ్యాయామ అధ్యాపకుడు ఈదర ఆది బాబు ప్రకటించారు. కళాశాలలో జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆది, సోమవారాలలో జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించి, అసోసియేషన్ అధ్యక్షుడు వీరబ్రహ్మారెడ్డి, కార్యదర్శి సిహెచ్.పుల్లయ్య సమక్షంలో జట్లు వివరాలు ప్రకటించారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా వ్యాయామ ఉపాధ్యాయులు జి.ఝాన్సీ రాణి, సిహెచ్.చినరత్తయ్య, నరసింహారావు, పి.వెంకయ్య, ఎం.వెంకటేశ్వర్లు, ఏ.వీరాంజనేయులు వ్యవహరించారు.

పురుషుల జట్టు...
బి.అశోక్, షేక్.అల్లాభక్షు (కృష్ణవేణి డిగ్రీ కళాశాల), ఎం.వెంకటేష్, పి.వెంకటేశ్వర రెడ్డి, బి.నాగరాజు (యాజాలి), బి.సింహాద్రినాయక్, బి.స్వామినాయక్, ఆర్.శ్రీను (ఈపూరు), కె.శ్రీహరి (ముటుకూరు), సిహెచ్.శ్రీకాంత్, పి.గణేష్ (విజ్ఞాన్ యూనివర్సిటీ), పి.రవి (వడ్లపల్లి), కె.రాఘవేంద్ర (కారంపూడి), పి.సైద (విక్టరీ డిగ్రీ కళాశాల), పి.లిఖిత్ సాయిరామ్‌రెడ్డి (కేఎల్ యూనివర్సిటీ), స్టాండ్ బై కె.గోపి, పి.గోపినాథ్, ఎం.అవినాష్.

మహిళల జట్టు...
డి.లక్ష్మీప్రసన్న (డీఎస్ఆర్ కళాశాల), టి.లక్ష్మీప్రసన్న చంద్రిక, బి.సౌజన్య (జడ్పీ హైస్కూల్, శంకరభారతీపురం), ఎం.హేమలత, ఎం.శిరీషా, ఎ.రమ్య, బి.అలేఖ్య (కృష్ణవేణి డిగ్రీ కళాశాల నరసరావుపేట), ఎన్.శ్రీలక్ష్మి (ఐఐఐటీ, ఒంగోలు), ఎం.పూజిత (ఎస్‌ఈసీ, నరసరావుపేట), వి.లావణ్య (భావన డిగ్రీ కళాశాల, నరసరావుపేట), కె.అలేఖ్య (ఏఎన్‌యూ), బి.లక్ష్మీప్రసన్న, పి.తిరుమల (జడ్పీ హైస్కూల్, ఒప్పిచర్ల), కె.శ్రీలక్ష్మి, జి.తిరుపతమ్మ (నిట్, నరసరావుపేట), స్టాండ్‌బై సీహెచ్ అలేఖ్య, కె.అనూష, బి.వి.అఖిలను ఎంపిక చేశారు.

లా కోర్సుల్లో ప్రవేశాలకు వేళాయె

- లాసెట్, పీజీ లాసెట్ రిజిస్ట్రేషన్ల గడువు ఈనెల 22 వరకు పొడిగింపు
- ప్రవేశాల ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే..
- 24 వరకు ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ల పరిశీలన
- 25, 26, 27వ తేదీల్లో కళాశాలల ఎంపికకై ఆప్షన్లు నమోదు
- ఈనెల 30న సీట్ల కేటాయింపు, 1, 2వ తేదీల్లో కళాశాలల్లో చేరికలు

గుంటూరు ఎడ్యుకేషన్: లా కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 25వ తేదీ నుంచి వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ ప్రారంభం కానుంది. లాసెట్, పీజీ లాసెట్‌లో అర్హత పొంది రెండేళ్లు, మూడేళ్లు, ఐదేళ్ల లా కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు ఈనెల 25, 26, 27వ తేదీల్లో కళాశాలలను ఎంపిక చేసుకునేందుకు ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంది. ఏపీ లా–సెట్, పీజీ లా–సెట్ ప్రవేశాలకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి విడుదల చేసిన షెడ్యూల్లో భాగంగా సోమవారం ముగిసిన రిజిస్ట్రేషన్ గడువును ఈనెల 22వ తేదీ వరకు పొడిగించింది. ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేయించుకోని విద్యార్థులకు మరో అవకాశాన్ని కల్పించారు. అదే విధంగా రిజిస్ట్రేషన్ సమయంలో ఆన్‌లైన్‌లో విద్యార్థులు అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ఈనెల 24 వరకు కొనసాగనుంది. లాసెట్, పీజీ లాసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, సర్టిఫికెట్ల పరిశీలన, కళాశాలల ఎంపిక ప్రక్రియ మొత్తాన్ని పూర్తిగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తోంది. కాగా ప్రత్యేక కేటగిరీకి చెందిన విద్యార్థులు తమ సర్టిఫికెట్ల పరిశీలన కోసం మంగళవారం విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశాలలో హాజరు కావాల్సి ఉంది. ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకున్న విద్యార్థులకు మరోసారి ఆప్షన్లను మార్చుకునేందుకు ఈనెల 28న ఒక్క రోజు అవకాశాన్ని కల్పించిన ఉన్నత విద్యా మండలి ఈనెల 30న సీట్ల కేటాయింపు జరపనుంది. సీట్లు పొందిన విద్యార్థులు డిసెంబర్ ఒకటి, రెండవ తేదీల్లో సంబంధిత కళాశాలలకు వెళ్లి చేరాల్సి ఉంది. ఎల్ఎల్‌బీ, బీఎల్ అర్హతతో రెండేళ్ల ఎల్ఎల్ఎం, ఇంటర్మీడియెట్ అర్హతతో ఐదేళ్లు, డిగ్రీ అర్హతతో మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సుల్లో ప్రవేశాలను కల్పించనున్నారు.

ప్రతి ఏటా పూర్తిస్థాయిలో సీట్ల భర్తీ..
కాగా ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంతో పాటు ప్రైవేటు రంగంలో విజ్ఞాన్, కేఎల్ యూనివర్సిటీలతో పాటు గుంటూరు నగర పరిధిలో జేసీ లా కళాశాల, ఏసీ లా కళాశాలలు ఉన్నాయి. లా కోర్సులపై పెరిగిన అవగాహన, న్యాయ నిపుణులకు నెలకొన్న డిమాండ్ దృష్ట్యా ప్రతి యేటా సీట్లు పూర్తిస్థాయిలో భర్తీ అవుతున్నాయి. కాగా లాసెట్, పీజీ లాసెట్ ప్రవేశాలకు సంబంధించిన కళాశాలల జాబితాను ఉన్నత విద్యామండలి ఈనెల 25న అధికారిక సైట్‌లో ఉంచనుంది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆయా కళాశాలల్లో సీట్ల కోసం వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంది.